క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఉసేన్‌స్వామికి ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో ఉన్న ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు చేరుకున్నారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు



దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: డోన్ రోడ్డులో ఉన్న సయ్యద్ షా వలి దర్గా ఉరుసును గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులతో పాటు మండల పరిధిలోని హెచ్ కొట్టాల, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామాల భక్తులు దర్గాను దర్శించుకున్నారు. దాతలు, దర్గా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

6న వేలం పాట

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఈనెల 6వ తేదీ ఉదయం 10:30 గంటలకు దిన, వారపు సంతమార్కెట్, బండ్లమెట్ట, కబేళాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. 1965 మున్సిపాలిటీ చట్టంలోని నిబంధనల మేరకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కొలిమిగుండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. 119 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 64 మంది ఎంపికైనట్లు చెప్పారు. పాఠశాలలో మొత్తం వంద సీట్లు ఉంటాయన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరిగిందన్నారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. వారం రోజుల్లో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

యువతి పెళ్లికి సహాయం

డోన్ టౌన్: మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన పేదింటి ముస్లిం యువతి పెళ్లికి స్ఫూర్తి సేవా సంస్థ చేయూతనిచ్చింది. గురువారం సంస్థ కార్యాలయంలో దాతల ద్వారా సేకరించిన రూ.5 వేల నగదు, 50 కేజీల బియ్యం, రెండు పట్టు చీరలను కుటుంబ సభ్యులకు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ఆలా మధు, సభ్యులు భాస్కర్, ప్రవీణ్, మోహన్‌రెడ్డి, నారాయణస్వామి, సురేష్ తదితరులు ఉన్నారు.

కూలిన చెట్ల తొలగింపు



కూలిన చెట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అవుకు: మండల కేంద్రంలో బుధవారం వీచిన ఈదురు గాలుల ధాటికి అవుకులో దశాబ్దాల కాలం నాటి భారీ చెట్లు నెలకొరిగాయి. అవుకు పట్టణంలోనే 40కి పైగా చెట్లు విరిగిపడ్డాయి. పలు ప్రదేశాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు పడి స్తంభాలు కూలిపోయాయి. సుమారు 11 గంటలు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గురువారం కూలిపోయిన చెట్లను అవుకు ఎంపీడీఓ వెంకటన్న, ఈఓఆర్డీ శ్రీనివాసులు, ఈఓ హరిప్రసాద్ పరిశీలించారు. విరిగిన చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది స్తంభాలు, వైర్ల మరమ్మతులు పనులు చేశారు.

నాయకుల విగ్రహాల ఏర్పాటుకు వినతి

డోన్ టౌన్: సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో పట్టణంలోని ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలు ధ్వంసం అయ్యాయని.. వాటిని తిరిగి ఏర్పాటు చేయాలని సంకల్ప్ అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

సారా కేసులో ఇద్దరికి రిమాండ్

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను సారా కేసులో గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. రామాపురానికి చెందిన దస్తగిరమ్మ, లక్ష్మీ బాయి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అకాల వర్షం.. తీరని నష్టం

- నేలవాలిన వరి, మొక్కజొన్న
- తడిసిన మిరప, పొగాకు దిగుబడులు
- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు



నేలకొరిగిన మొక్కజొన్న పంట



తడిసిన పొగాకు బేడలు



నేలవాలిన వరి పంట

అవుకు: అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. మండలంలో గత నెల 28న కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను రక్షించుకుందాం అనుకునేలోపే మళ్లీ బుధవారం భారీ ఈదురుగాలులతో వర్షం కురిసి అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. వరి, మొక్కజొన్న పంటలు, మిర్చి, పొగాకు దిగుబడులు పూర్తి దెబ్బతిన్నాయి. తడిసిన దిగుబడులను రక్షించుకునే పనిలో గురువారం రైతులు బిజీ అయ్యారు. ఇప్పటికే కోత దశలో ఉన్న వరి పంటలు ఈదురుగాలుల ధాటికి నేలవాలిపోయాయి. మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. అసలే మిర్చికి ధరలేక రైతులు దిగాలుగా ఉంటే అకాల వర్షం మరింత ఆవేదనకు గురిచేసింది. పొగాకు రైతుల బాధ వర్ణనాతీతం. తడిసిన పొగాకును ఆరబెట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వరి 3,676 ఎకరాలు, మొక్కజొన్న 2881 ఎకరాలు, మిర్చి 1338 ఎకరాలు, పొగాకు 1320 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ముఖ్యంగా శింగనపల్లె, అవుకు, మెట్టుపల్లె గ్రామాల్లో ఎక్కువగా పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రకృతి రైతులపై విళయతాండవం చేస్తున్నా ... కూటమి ప్రభుత్వం మాత్రం రైతులను ఏమాత్రం పట్టించుకోవటం లేదని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బొప్పాయి తోట ధ్వంసం

ఈదురు గాలులు ఓ రైతును నిండా ముంచాయి. కొద్ది నెలలుగా పంటను రక్షించుకుంటూ వచ్చాడు.. పంట చివరి దశకు రావడంతో కోతలకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఇలాంటి సమయంలో ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఒక్కసారి తోటను చూసొద్దామని గురువారం ఉదయం వెళ్లాడు. ఇంకేముంది... చెట్లు మొత్తం విరిగిపోయి నేలనపడ్డాయి. ఆ దృశ్యాన్ని చూసిన రైతు ఏమి చేయాలో దిక్కుతోచక కన్నీరు పెట్టుకున్నాడు. వివరాలు.. అవుకు మండలం సంగపట్నానికి చెందిన షంషీర్ వలి తనకు ఉన్న ఎకరా ముప్పై సెంట్ల భూమిలో 9నెలల క్రితం 1350 బొప్పాయి చెట్లను నాటాడు. ప్రతి రోజూ పంటను చూసుకుంటూ, కావాల్సి మందులను వేస్తూ వచ్చాడు. పంట కోత దశకు రావడంతో ఓ దళారితో టన్ను రూ.40వేలకు మాట్లాడుకున్నాడు. రెండు రోజుల్లో కోతలు ప్రారంభించాలి. అయితే బుధవారం తీవ్ర గాలులు వీయడంతో చెట్లన్నీ విరిగి పడ్డాయి. 20 చెట్లు మినహా మొత్తం చెట్లనీ విరిగిపోయాయి. ఇన్నాళ్లు పడిన కష్టానికి ప్రతిఫలం లేకుండా పోయిందని.. దాదాపు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

బేతంచెర్లలో వడగండ్ల వాన

బేతంచెర్ల: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఒకవైపు మండే ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు కొంత మేర వాతావరణం చల్లబడి ఉపశమనం లభించినా పలు గ్రామాల్లో మామిడి, అరటి తోటలు, కొర్ర పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. భారీ ఈదురు గాలులతో డోన్ రోడ్డులోని ఆపతి మద్దయ్య, పత్తిపాటి మధు, కొమ్మూరు చంద్రమోహన్, నారాయణ, కొమ్మూరు మద్దిలేటిలకు చెందిన 5 పాలిష్ పరిశ్రమలపై ఉన్న పైకప్పు లేచిపోయింది. రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.



గోరుమానుకొండ తండాలో కురిసిన వడగండ్లు



పాలిష్ పరిశ్రమలో లేచిపోయిన పైకప్పు

80 హెక్టార్లలో అరటి పంటకు నష్టం

కొలిమిగుండ్ల: ఇటీవల వీచిన పెనుగాలులకు అరటి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. అరటి గెలలు కోత కోసే దశలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో రైతులకు కోలుకోలేని దెబ్బపడింది. ఎట్టకేలకు ఉద్యాన శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేశారు. మదనంతపురం, కోర్నపల్లె తదితర గ్రామాల్లో 80 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు పంపారు. గాలుల ప్రభావంతో పలు గ్రామాల్లో చీని, మామిడి కాయలు రాలిపోయాయి. రాలిపోయిన కాయలకు నష్టపరిహారం జాబితాలో అవకాశం లేదని అధికారులు తేల్చిచెప్పడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చివరి దశలో గాలులకు రాలిపోవడంతో నష్టపోయారు. గతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా రాలిపోయిన చీని, మామిడి కాయలకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేదని రైతులు పేర్కొన్నారు. ఈసారి ఆ అవకాశం లేదని చెప్పడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. గాలులు ప్రభావం వల్ల ఎకరాకు 40 చెట్లు విరిగిపడిపోతేనే నష్ట పరిహారం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారని వాపోయారు.

కొనసాగిన సీహెచ్‌ఓల నిరసన

బనగానపల్లె రూరల్: ఆయుష్మాన్ భారత్‌లో సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రోవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. రెండో రోజు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓలు), మిడ్‌లెవెల్ హెల్త్ ప్రోవైడర్స్ తమను రెగ్యులర్ చేయాలని ఒంటి కాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు.

జాగ్రత్తలు తీసుకుంటే పంటను రక్షించుకోవచ్చు

అవుకు: నేలవాలిన పంటలపై జాగ్రత్తలు తీసుకుంటే రక్షించుకోవచ్చని కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకులు సుధాకర్ అన్నారు. మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. దీంతో గురువారం అవుకు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్‌తో కలిసి అవుకు, మెట్టుపల్లె గ్రామాల్లో పంటలను ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల దిగుబడులు చేతి కొచ్చే సమయంలో అకాల వర్షం కురవడంతో దాదాపు 600 ఎకరాల వరి, 60 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. అయితే నేలవాలిన వరి పంటను కట్టలుగా కట్టి గింజలు రాలిపోకుండా కాపాడుకోవచ్చని సూచించారు. అలాగే వచ్చిన దిగుబడిపై కూడా రైతులు కాస్త జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్లాల్లో ఆరబోసిన దిగుబడులపై టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచుకోవాలన్నారు.

సబ్ కోర్టు మంజూరుకు వినతి



జిల్లా జడ్జి కబర్దితో బనగానపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు

బనగానపల్లె: బనగానపల్లె, కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు పరిధిలో సబ్ కోర్టు మంజూరు చేయాలని బనగానపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్దికి విజ్ఞప్తి చేశారు. కర్నూలులో జడ్జిని కలిశారు. బనగానపల్లె, కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టుల పరిధిలో సుమారు 6 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సబ్ కోర్టు ఉంటే కేసులు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే బనగానపల్లె కోర్టు భవనం 120 ఏళ్ల క్రితం నాటిదని, ప్రస్తుతం శిథిలావస్థలో ఉందని, నూతన భవనం మంజూరుకు ఉన్నత న్యాయస్థానానికి ప్రతిపాదనలు పెంపేందుకు సహకరించాలని కోరారు. సబ్ కోర్టు, నూతన భవనం నిర్మాణానికి ఉన్నత న్యాయస్థానానికి సిఫార్సు చేస్తామని జిల్లా జడ్జి పేర్కొన్నట్లు బార్ అసోసియేషన్ న్యాయవాదులు తెలిపారు. అసోసి యేషన్ అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, కార్యదర్శి శ్రీనివాస మూర్తి, కమిటీ సభ్యులు భాస్కర్, జాకీర్‌హుస్సేన్, అల్లావుద్దీన్, రఫీ, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ

ప్యాపిలి: యువత క్రీడలపై దృష్టి సారించి దేహదారుఢ్యాన్ని పెంచుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం క్రికెట్ ఓపెన్ టోర్నమెంట్ పోటీలను వారు ప్రారంభించారు. మొబైల్ ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్ కారణంగా మానసిక రుగ్మతలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రికెట్, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలను ఆడాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలోనే పోటీలు ఉండాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటరాముడు, మధు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



డోన్ ఆర్టీసీ డిపో వద్ద ఈయూ నాయకుల నినాదాలు

వాడవాడలా మేడే వేడుకలు

మేడేను గురువారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్మిక హక్కుల కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఏకం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



బనగానపల్లె: నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో..



అవుకులో ఏఐటీయూసీ నాయకులు



సిమెంట్‌నగర్‌లో ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ



కోవెలకుంట్లలో ప్రజా సంఘాల నాయకులు

శ్మశాన వాటికకు అదనపు స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్

డోన్: పట్టణంలో హిందూ శ్మశాన వాటికకు మరో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్ గురువారం తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా స్థలం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 1.92 ఎకరాల స్థలం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. కొందరు సమాధులు నిర్మించడంతో దహన సంస్కారాలు పెద్ద సమస్యగా మారిందన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబ్ బాషా

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేట కాలనీకి చెందిన షేక్ మాసుం బాషా గత నెల 13వ తేదీ పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భార్య షేక్ రేష్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కేసీ తిరుపాలు గురువారం తెలిపారు.

మొరాయించిన రైల్వే గేటు



నిలిచిపోయిన వాహనాలు

బేతంచెర్ల: పట్టణంలోని బనగానపల్లె రైల్వేగేటు గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సాంకేతిక కారణాలతో మొరాయించింది. దీంతో గంట పాటు బనగానపల్లె, కోవెలకుంట్ల, జమ్ములమడుగు, ప్రొద్దుటూరు, కర్నూలు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు గేటు వద్ద నిలిచిపోయాయి. అలాగే ప్రైవేటు వాహనాలు, బనగానపల్లె వైపు నుంచి బేతంచెర్లకు వస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్లు భారీగా నిలిచిపోయాయి. గంట తరువాత రైల్వే గేటు తెరుచుకోవడంతో వాహనాలు కదిలాయి. గేటు వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతోందని.. రైల్వే అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలోని కాలమ్మ కట్ట వద్ద అక్రమంగా నిర్మించిన మెట్లను తొలగించాలని వార్డు సభ్యుడు వీరనాగేంద్ర, స్థానికులు మహేశ్, మహమ్మద్, వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శి సుబ్బమ్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. కాలమ్మ కట్ట వద్ద నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్ కుమారులు అక్రమంగా తమ ఇళ్లకు మెట్లు నిర్మించారని వాపోయారు. రస్తాకు అడ్డంగా నిర్మించిన ఈ మెట్ల కారణంగా కాలనీలోకి ట్రాక్టర్లు, మినీ లారీలు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు.

సమ్మర్ క్యాంపుతో అదనపు విజ్ఞానం



శిక్షణకు హాజరైన విద్యార్థులు

బేతంచెర్ల: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, కంప్యూటర్‌పై ఉపాధ్యాయులు కృష్ణ ప్రియ, జాకీర్ హుస్సేన్ శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ప్రయాణికుల పాట్లు



బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు



అరకొర వచ్చిన బస్సులు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

- అమరావతికి తరలిన ఆర్టీసీ బస్సులు
- పలు రూట్లలో బస్సులు లేక అవస్థలు

కోవెలకుంట్ల: అమరావతి పున: నిర్మాణ కార్యక్రమ సభకు ప్రజలను తరలించేందుకు కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులను భారీగా తరలించారు. డిపో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ప్రయాణీలు అవస్థలు పడ్డారు. స్థానిక డిపో నుంచి 15 ఆర్టీసీ బస్సులను గుంటూరు జిల్లాకు కేటాయించగా గురువారం మధ్యాహ్నం నుంచే బస్సులు వెళ్లిపోయాయి. బస్సులు లేని కారణంగా డిపో పరిధిలోని వివిధ రూట్లలో పలు సర్వీసులు రద్దు కావడంతో గమ్యస్థానాలు చేరేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డిపో పరిధిలోని కర్నూలు–తిరుపతి, లింగాల– నంద్యాల, ఉయ్యాలవాడ–తిరుపతి, డబ్ల్యూ కొత్తపల్లె– కర్నూలు, కోవెలకుంట్ల– కర్నూలు, కొండసుంకేసుల– కర్నూలు, కోవెలకుంట్ల– బళ్లారి రూట్లలో తిరిగే బస్సులను డిపో అధికారులు రద్దు చేశారు. ఈ బస్సులతోపాటు మధ్యాహ్నం నుంచి మరికొన్ని బస్సులను అమరావతికి పంపడంతో పలు సర్వీసులు రద్దయ్యాయి. మధ్యాహ్నం నుంచి శుక్రవారం రాత్రి వరకు పై రూట్లతోపాటు డిపో నుంచి నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్ములమడుగు, కర్నూలు, తాడిపత్రి, తదితర రూట్లలో కొన్ని సర్వీసులు రద్దు కానున్నాయి. మంచి ముహూర్తం కావడంతో గురువారం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. డిపో పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు బస్సుల ద్వారా వివిధ ప్రాంతాలకు వెళ్లారు. సాయంత్రం తిరిగి గమ్యస్థానాలు చేరుకునేందుకు బస్టాండ్‌కు రాగా ఆయా రూట్లలో బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అరకొరగా వచ్చిన బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు రద్దీగా ఉన్న బస్సులు ఎక్కలేక ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్లిపోయారు. కర్నూలు, ప్రొద్దుటూరు రూట్లకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. శుక్రవారం రాత్రి వరకు ఇదే పరిస్థితి ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

‘ఆ నలుగురు’ మానవత్వం



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు సభ్యులు

బేతంచెర్ల: అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్న ఓ మహిళ కుటుంబానికి ఆ నలుగురు స్వచ్ఛంద సభ్యులు మేమున్నామని ముందుకొచ్చి మహిళకు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ సమీపంలోని ఓ ఇంట్లో జమ్ములమడుగుకు చెందిన అత్తాకోడళ్లు రాజేశ్వరి, వేదవతి అద్దెకు ఉంటున్నారు. ఇంట్లోనే బజ్జీలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అనారోగ్యంతో గురువారం అత్త రాజేశ్వరి (55) మృతిచెందింది. కోడలు వేదవతి దివ్యాంగులు కావడం.. ఎవరి సహాయం లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వన్నూర్ బాషాను కోరింది. ఆయన పోలీసుల అనుమతి తీసుకుని ఆ నలుగురు సభ్యులు జెబి ఉల్లా, విక్రమ్, రవి కుమార్‌తో కలిసి స్థానిక హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ



పాతపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

బనగానపల్లె రూరల్: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 92శాతం పూర్తయిందని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. వివిధ రకాల పింఛన్లు మొత్తం 12,256 ఉండగా 92 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన లబ్ధిదారులకు శుక్ర, శనివారాల్లోపు పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. కాగా గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ ఆఫీసర్ శివారెడ్డి మండలంలోని యాగంటిపల్లె, పాతపాడు గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.